# పిడుగు

– పి.ఎస్. నారాయణ.



ఆ వీధి వీధంతా రొచ్చే. ఇళ్లల్లో మురుగునీళ్లన్నీ రోడ్డుమీదే వుంటాయి. ఆ వీధిలో డాబా ఇళ్ల కంటే పెంకుటిళ్లే ఎక్కువ. పదేళ్ల కిందట వేసిన కంకర రోడ్డు మీద మోకాలు లోతు మట్టి.

ఆ వీధికే లీడర్‌లా తలెగరేస్తూ పెద్ద రంగుల డాబా. డాబా మీద పెద్ద గది. అందులో పందిరి మంచం. వెనుకా ముందూ నిలువెత్తు అద్దాలు.

ఆ ఇంటిముందు బర్రెలు. వాటికి తాటాకు పందిళ్లు. నీళ్లు త్రాగేటందుకు రాతితొట్టెలు. ఓ పక్కగా గడ్డి. తవుడు బస్తాలు. పేడ కంపు.

ఆ ఇంటి యజమానురాలు మాణిక్యం. మనిషి పిటపిటలాడుతుంటుంది. చామనఛాయే అయినా

కళకళలాడుతుంటుంది. ఏడు గంటలయ్యే టప్పటికల్లా షూటింగ్‌కు రెడీ అయిన సినిమా స్టార్‌లా తయారవుతుంది. ఓ అరగంటసేపు వరండాలో కూర్చుని పనివాళ్లు పాలమ్ముతుంటే అజమాయిషీ చేస్తుంటుంది.

ఆ పని అవగానే మేడెక్కి పందిరి మంచం మీద కూర్చుంటుంది. ఆవిడంటే పడిచచ్చేవాళ్లు ఆ ఊళ్లో చాలామంది వున్నారు. ఆవిడ పేరు తెలిసిన వాళ్లు ఆడామగా కొన్ని వందల మంది వున్నారు.

తట్టుకోగలిగినవాడు మేడెక్కుతాడు. లేనివాళ్లు పెందరాళే వచ్చి ఆమెను చూస్తూ పాలు పోయించుకుని తృప్తిపడుతుంటారు.

ఆమె ఇంటికి తరచూ వచ్చే మనిషి వెంకటాచలం. బాగా డబ్బుండి కొవ్వెక్కిన మనిషి. నెలకు అయిదారు సార్లు ఆవిడతో ఆ మేడమీద ఓ గంటసేపు కాలక్షేపం చేస్తుంటాడు.

ఆ రోజు ఎనిమిదిన్నరకు సిల్కు లాల్చీ జేబులో పాలిస్టర్ ధోవతి అంచు దోపుకుని మేడ మెట్లు దిగాడు వెంకటాచలం.

క్రిందకు దిగి గొడ్ల కంపుకు మొఖం చిట్లించుకుంటూ అక్కడే తచ్చట్లాడుతున్న చిన్నాను చూచాడు. వాడికి పదేళ్లుంటాయి. సన్నగా వున్నాడు. పొట్టి నిక్కరు వేసుకుని చొక్కా తొడుక్కున్నాడు. వాడు మాణిక్యం ఒక్కగానొక్క కొడుకు.

'ఇందాక కనబడలేదేంరా చిన్నా... ఇంద... ఈ పది తీసుకెళ్లి ఏమన్నా కొనుక్కో' అంటూ వాడికి పది రూపాయల నోటిచ్చాడు.

వాడు మొహమాటంగా నవ్వుతూ ఆ నోటు తీసుకున్నాడు.

వాడినే చూస్తూ, 'ఇంతకీ నీకు మీ నాన్నెవరో తెలిసిందిరా?' అన్నాడు ఎగతాళిగా. వాడిని ఆటపట్టించడం వెంకటాచలంకు సరదా. వాడిని చూస్తూనే కళ్లు చికిలించి పళ్లన్నీ బయటకు పెట్టి నవ్వుతుంటాడు.

చిన్నా ఇబ్బందిగా ఆయన వంక చూసి తల తిప్పుకుని బయటకు వెళ్లిపోయాడు.

వెంకటాచలం వాడి సమాధానం కోసం ఎదురుచూడలేదు. బయటకు వచ్చి వాకిట్లో పెట్టిన స్కూటర్‌ను స్టార్ట్ చేసి సెంటర్‌కు వెళ్లిపోయాడు. అక్కడ క్లబ్బులో ఓ గంటసేపు పేకాడతాడు. తొమ్మిదీ పదీ మధ్య భార్యకు ఓ నాలుగు మూరల మల్లెపూల దండ తీసుకుని ఆమె మీద ప్రేమను కురిపించేస్తూ ఇంట్లో కాలు పెడతాడు.

చిన్నా స్కూటర్ దూరంగా వెళ్లిపోయేటంత వరకూ దీపపు స్తంభం నీడలో నిలబడి చూస్తూ వుండిపోయాడు.

ఆయనగారు డబ్బులిస్తాడు- బాగానే వున్నది- ఇస్తున్నప్పుడల్లా ఆ ప్రశ్నే వేస్తాడేమిటి?

మహా చికాగ్గా వుంటుంది ఆ ప్రశ్న వినాలంటే ఆ పిల్లవాడికి.

తెలియదా ఆయనకు- ఆ వీధిలో తనకే కాదు చాలామంది పిల్లలకు తండ్రెవరో తెలియదని- వాళ్లకు అన్నీ తల్లే!

తను గమనిస్తూనే వున్నాడు- ఆయన ఆ ప్రశ్న వేయడం... నవ్వడం... తన సమాధానం కోసం ఆగకుండానే స్కూటరెక్కి వెళ్లిపోవడం.

ఇప్పటికి అతడు ఆ ప్రశ్న వేయటం ఏ పదోసారో!

సాయంత్రమే తల్లి దగ్గర బాగా చివాట్లు తిన్నాడు- ఎవరికో పాలు పోస్తూ క్రింద ఒలకబోసినందుకు. అప్పటి నుండీ మహా చికాగ్గా వున్నాడు. తను కావాలని పారబోశాడా? అయినా ఎన్ని పోయినాయని...

దానికితోడు ఈ వెంకటాచలం వెధవ ప్రశ్న వాడిని మరింత కలచివేసింది. కోపం తెప్పించింది.

కసిగా చేతిలోని అతడిచ్చిన పది రూపాయల నోటును ఉండలా చుట్టి జేబులో కుక్కుకున్నాడు.

ఇంటి మెట్లు దిగాడు. అలవాటువడ్డ దారవ్వడంతో కాలికి బురదవ్వకుండా నడుస్తున్నాడు ఆ సందులో. ఆ వీధి చివర్లో వున్న డబ్బా కొట్టు ముందు ఆగి చాక్లెట్లు తీసుకున్నాడు ఆ పది రూపాయల నోటిచ్చి.

'వెంకటాచలం గారు ఇచ్చారేమిట్రా!' అన్నాడు ఆ కొట్టులో ముసలాడు నవ్వి చిన్నాకు మిగతా చిల్లరిస్తూ...

చిన్నా మాట్లాడలేదు. తీసుకున్న చాక్లెట్ల రేపర్లన్నీ తీసి ఒకేసారి నోట్లో వేసుకుని కసిగా నములుతూ రోడ్డెక్కాడు వడివడిగా అడుగులేస్తూ.

'వెధవలకి అందరికీ ఎగతాళిగానే వున్నది తనంటే!' అనుకున్నాడు పళ్లు కొరుక్కుంటూ.

ఒళ్లంతా సెగలు పొగలతో రగిలిపోతోంది కోపంతో.

అతడు నడుస్తూనే వున్నాడు. నాలుగు వీధులు దాటడానికి పావుగంట పట్టింది. పెద్ద రోడ్డెక్కాడు. తెల్ల బల్బుల కాంతిని దాటి మళ్లీ చిన్న రోడ్డులోకి తిరిగాడు.

అక్కడ మొదట్లోనే రెండంతస్తుల మేడ ముందు ఆగాడు. పైకి క్రిందకు చూశాడు ఒకసారి.

కళ్లల్లో ఎర్ర చారలు వస్తున్నాయి.

చిన్నగా ఆ ఇంటి అరుగుల మధ్యగా వున్న నాలుగు మెట్లూ ఎక్కి గేటు లోపలకు నెట్టాడు. వరండాలో కూర్చుని ఎవరితోనో కబుర్లు చెబుతున్న ఆమెను చూశాడు.

'మా నాన్న ఉన్నారా అండీ!' అన్నాడు.

ఆమె వింతగా అతడి వంక చూసింది. 'ఎవరు నువ్వు... ఎవరిల్లు కావాలి... మీ నాన్న అంటే పేరు లేదా?' అన్నది.

'ఇది వెంకటాచలం గారి ఇల్లే కదండీ!' అన్నాడు వినయంగా చిన్నా.

'అవును!'

'ఆయనే కదండీ మా నాన్న... నేను మాణిక్యం కొడుకునండీ... రోజూ మా ఇంటికి వచ్చి మా నాన్న నాకు చాక్లెట్లు కొనిపెడుతుంటాడండీ... ఇవాళ ఎందుకో రాలేదు... మా అమ్మ వెళ్లి వెంటనే రమ్మనమని చెప్పమన్నది!' అంటూనే... ఆమె ఏమంటున్నదో కూడా వినిపించుకోకుండా- తన కసినంతా ఆ గేటు లోపలే కుమ్మరించేసి- రోడ్డు మీదకు పరిగెత్తాడు చిన్నా! ○

# ఏది చెత్త?

కొత్తగా అమెరికా వెళ్లే ఒకతను హెయిర్ కట్ కోసం 'తిరు క్షవరం హెయిర్ కటింగ్ సెలూన్'కి వెళ్లాడు.

'బాగా చెయ్యి. అమెరికాకి నేను వెళ్లేది. అదిరిపోవాలి.' చెప్పాడతను అక్కడ పనిచేసే ఆంజనేయులుకి.

'అమెరికాకా? ఛ! అక్కడకెందుకు వెళ్తున్నారు? ఎక్కడ చూసినా నల్లవాళ్లు లేదా తెల్లవాళ్లే. ఇంగ్లీష్ తప్ప మరే భాష మాట్లాడరు. డాలర్స్ ఇస్తేగానీ ఏ పనీ ఉచితంగా చెయ్యరు. సర్లెండి. నాకెందుకు కానీ ఏ విమానంలో వెళ్తున్నారు?' ప్రశ్నించాడు ఆంజనేయులు.



'డెల్టా ఎయిర్‌లైన్స్‌లో.'

'డెల్టా? ఛ! అదో చెత్త విమానాల కంపెనీ. వాళ్ల విమానాలన్నీ పాతవి. అందులోని ఎయిర్ హోస్టెస్‌లంతా అనాకారులు. వాళ్లెప్పుడూ లేటే. సర్లెండి, నాకెందుకు కానీ అమెరికాలో ఎక్కడ వుంటారు?

'హయత్ రిజెన్సీ హోటల్‌లో.'

'ఛ! ఆ చెత్త హోటల్‌లోనా? అక్కడి గదులన్నీ చిన్నవి. అద్దె ఎక్కువ. భోజనం అసలే బావుండదు. వారి సర్వీస్ లేట్. సర్లెండి, నాకెందుకు కానీ ఏ పనిమీద వెళ్తున్నారు?'

'జార్జ్ బుష్ నన్ను వైట్‌హౌస్‌కి టీకి ఆహ్వానించాడు.'

'అతనా? ఛ! అంతటి పరమ చెత్త ప్రెసిడెంట్ ఇంకొకడుండడు. వాడి తండ్రీ పరమ పీనాసే. ఈయనా అంతే. టెర్రరిస్టులని కంట్రోల్ చేయలేకపోయాడు.

నెల తర్వాత పెరిగిన జుట్టుతో మళ్లీ అతను ఆంజనేయులు సెలూన్‌కి హెయిర్‌కటింగ్‌కి వచ్చాడు.

'అమెరికాకి వెళ్లొచ్చారుగా. అక్కడి విశేషాలు చెప్పండి' అడిగాడు ఆంజనేయులు.

'చాలా బాగా జరిగింది ట్రిప్. డెల్టా వారి చెత్త విమానం నిండా అందమైన ఎయిర్ హోస్టెస్‌లే. టైంకి టేకాఫ్ అయి టైంకి లేండయింది మా ప్లేన్.'

హోటల్ నే చెప్పినట్లుగానే చెత్తగా వుంది కదూ!'

'లేదు. విశాలమైన గదులు. హోటల్‌ని రీమోడల్ చేయడానికి వాళ్లు ఇరవై అయిదు లక్షలు ఖర్చు చేశారుట. ఇక భోజనం అయితే బ్రహ్మాండం. హోటల్ ఫుల్ అనుకో. గది దొరక్క చాలామంది వెళ్లిపోతున్నారు.

'ప్రెసిడెంట్ మిమ్మల్ని రిసీవ్ చేసుకున్నాడా?' మొహం మాడ్చుకున్న ఆంజనేయులు ప్రశ్నించాడు.

'సాదరంగా. మా కారు ఆగగానే తలుపు తనే స్వయంగా తెరచి సాదరంగా రిసీవ్ చేసుకున్నాడు. నా భుజంమీద చేతిని వేసి వైట్‌హౌస్‌లోకి తీసుకెళ్లాడు. నా భార్యాపిల్లలు కులాసా అని అడిగాడు కూడా. ఇంకో మాట కూడా అన్నాడు. చెప్పనా?' అడిగాడతను.

'చెప్పండి. ఏమన్నాడు?'

'నీ జుట్టుకి ఇంత చెత్తగా క్రాఫ్ చేసింది ఎవరు? అని అడిగాడు' ఆంజనేయులుతో తాపీగా చెప్పాడతను.

- ఎం. పృథ్వీరాజ్